బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 18 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

# టీజీ సెట్‌లకు కన్వీనర్ల నియామకం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రవేశాల అర్హత కోసం నిర్వహించే రాష్ట్ర స్థాయి పరీక్ష "సెట్‌లు. కాగా, ఈ సెట్ పరీక్షల కోసం ఉన్నత విద్యా మండలి కన్వీనర్‌లను నియమించింది. ఈ మేరకు ఏడు సెట్లకు సంబంధించి కన్వీనర్లను నియమిస్తూ ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఏ యూనివర్సిటీ ఏ సెట్ నిర్వహిస్తుందో కూడా ప్రకటించింది. సెట్స్ నిర్వహణ తేదీలను త్వరలో విడుదల చేయనున్నట్లు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది.

**టీజీ ఐసెట్ - ప్రొఫెసర్ అలువాల రవి (మహాత్మా గాంధీ యూనివర్సిటీ)**
**టీజీ ఎప్‌సెట్ - ప్రొఫెసర్ బీ డీన్ కుమార్ (జేఎన్‌టీయూ హెచ్)**
**టీజీ పీజీసెట్ - ప్రొఫెసర్ అరుణ కుమారి (జేఎన్‌టీయూహెచ్)**
**టీజీ లాసెట్, టీజీ పీజీఎల్‌సెట్- ప్రొఫెసర్ బీ విజయలక్ష్మీ (ఉస్మానియా యూనివర్సిటీ)**
**టీజీ ఈసెట్ -ప్రొఫెసర్ పీ చంద్రశేఖర్ (ఉస్మానియా యూనివర్సిటీ)**
**టీజీ ఎడ్‌సెట్ - ప్రొఫెసర్ బీ వెంకట్రామ్ రెడ్డి (కాకతీయ యూనివర్సిటీ)**
**టీజీ పీఈసెట్ - ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ (పాలమూరు యూనివర్సిటీ)**

## లోక్‌సభ ముందుకు

# జమిలి ఎన్నికల బిల్లు



- **వ్యతిరేకించిన విపక్షాలు -**
- **మద్దతిచ్చిన టీడీపీ, జనసేన**
- **బిల్లును జేపీసీకి పంపిన కేంద్రం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్ ముందుకొచ్చింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎన్డీయే మిత్ర పక్షాలు ఈ బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కానీ ఈ జమిలి బిల్లును కాంగ్రెస్ సహా విపక్షాలు అన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. పూర్తి స్థాయి చర్చ జరిగేందుకు వీలుగా ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. విస్తృత సంప్రదింపులు జరిపేందుకు గానూ పార్లమెంటు ఉభయసభల ఉమ్మడి కమిటీకి ఈ బిల్లును సిఫారసు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మేఘ్వాల్ కోరారు.

జమిలి బిల్లును లోక్‌సభ పరిగణనలోకి తీసుకోవడంపై విపక్ష సభ్యులు ఓటింగ్ కోరారు. ఇందుకు అంగీకరించిన స్పీకర్ హైబ్రిడ్ విధానంలో ఓటింగ్ నిర్వహించారు. 360 మంది ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో, మరికొందరు బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేశారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటు వేశారు. దీనితో జమిలి ఎన్నికల బిల్లులు ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లు అయ్యింది.

ఓటింగ్‌కు ముందు జమిలి బిల్లుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. "129వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం. రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడి చేస్తున్న ఈ బిల్లులను వ్యతిరేకిస్తున్నాం" అని కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌కు విరుద్ధంగా బిల్లులను ప్రవేశపెట్టారని ఆయన మండిపడ్డారు."రాజ్యాంగ సవరణ బిల్లు దేశ ఎన్నికల ప్రక్రియనే సమూలంగా మార్చివేస్తుందని, దీనిపై చర్చ జరగాలని" ఆర్ఎస్‌పీ సభ్యుడు ప్రేమచంద్ర పట్టుబట్టారు."జమిలి ఎన్నికలంటే రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే" అని టీఎంసీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ ఆరోపించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి వైరస్ లాంటివని విమర్శించారు. కేవలం ఒక వ్యక్తి (మోదీ) కలను నెరవేర్చేందుకే బిల్లు పెట్టారని బెనర్జీ ఆరోపించారు. జమిలి బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు చెప్పారు.

ఎన్డీయే మిత్రపక్షమైన టీడీపీ జమిలి ఎన్నికల బిల్లుకు మద్దతు తెలిపింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బిల్లుకు మద్దతు తెలపగా, విపక్ష సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. శివసేన ఉద్దవ్ వర్గం బిల్లును వ్యతిరేకించగా, శిందే వర్గం సభ్యులు మద్దతు తెలిపారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, ఎంఐఎం, సీపీఎం సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఎన్సీపీ ఎస్పీ సభ్యురాలు సుప్రియా శూలే బిల్లును వ్యతిరేకించారు. టీఆర్ బాలు కోరినట్లు బిల్లును జేపీసీకి పంపించి చర్చకు ముగింపు పలకాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచించారు. సమాఖ్య స్ఫూర్తికి జమిలి బిల్లు విరుద్ధం కాదని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చెప్పారు.

# హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- **ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం**
- **శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పర్యటన**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



శీతాకాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం హైదరాబాద్ విచ్చేశారు. సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయం చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దనసరి అనసూయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, త్రివిధ దళాల అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ద్రౌపదిముర్ము హకీంపేట నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 21 వరకు ఐదు రోజుల పాటు రాష్ట్రంలో బస చేయనున్నారు. బుధవారం ఆమె పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, అధికారులు, పౌరులతో రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహిస్తారు.

# ఏసీబీకి లేఖ రాసిన సీఎస్ శాంతి కుమారి..



- **ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు వ్యవహారం**
- **ఇప్పటికే గవర్నర్ అనుమతి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా–ఈ కార్ రేస్ కేసు వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేసుపై లోతుగా దర్యాప్తు చేయాలని కోరుతూ ఏసీబీకి తెలంగాణ సీఎస్ శాంతికుమారి లేఖ రాశారు. విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడు పెంచింది. ఈ మేరకు గవర్నర్ ఇచ్చిన అనుమతిని సీఎస్ తాను రాసిన లేఖకు జత చేసి ఏసీబీకి పంపించారు. ఫార్ములా–ఈ కార్ రేస్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ జరపాలని ఏసీబీని సీఎస్ కోరారు.రేసింగ్‌కు సంబంధించిన పూర్వాపరాలు, దీని నిర్వహణకు అప్పటి బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్ తీసుకున్న చర్యలపైనా సమగ్ర దర్యాప్తు చేయాలని సీఎస్ శాంతి కుమారి విజ్ఞప్తి చేశారు. అలాగే ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కరెన్సీ చెల్లించడం, ప్రజాధనం దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరారు. అలాగే ఒప్పందానికి రెండు వారాల ముందే డబ్బు చెల్లించడం, ఆ తర్వాత ఒప్పందం చేసుకోవడంపైనా విచారణ చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన సహా తదితర అంశాలపై పూర్తిగా దర్యాప్తు చేయాలని కోరుతూ ఏసీబీకి సీఎస్ శాంతి కుమారి లేఖ రాశారు.

## లగచర్ల ఘటనపై చర్చకు బీఆర్ఎస్ పట్టు..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



లగచర్ల ఘటనపై శాసన మండలిలో చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. కానీ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. సభ్యుల ఆందోళనల మధ్య రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో లగచర్ల రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఇదేమీ రాజ్యం.. ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఇక కౌన్సిల్ నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు.. మండలి ఆవరణలో తమ నిరసనను కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే లగచర్ల పేద గిరిజన, దళిత రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీలో నల్ల చొక్కాలు ధరించి నినాదాలు చేస్తూ, చేతులకు బేడీలు వేసుకొని నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.







# అసెంబ్లీలో అప్పుల కుప్పపై చర్చ

- **ఏడాదిలోనే రూ. 1 లక్ష 27 వేల కోట్లు అప్పు చేసిన ప్రభుత్వం**
- **ఇలాగైతే ఐదేండ్లలో రూ. 6.37 లక్షల కోట్లకు అప్పు : హరీశ్‌రావు**
- **మీరు చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు కట్టాం**
- **మేమే చేసింది రూ.51 వేల కోట్ల చేశాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **భట్టిపై ప్రివిలేజ్ మోషన్.. చర్చ జరగాలని హరీశ్ పట్టు**
- **ఎలాంటి చర్చ లేకుండానే 3 బిల్లులకు శాసనసభ ఆమోదం**
- **బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన మధ్య బిల్లులకు ఆమోదం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శాసనసభలో మంగళవారం ప్రశ్నో త్తరాల సమయంలో ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై వాడీవేడిగా చర్చ నడిచింది. అప్పులకు కారణం మీరంటే..మీరే కారణమంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లకు దారి తీసింది. 'ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి? ఇలాగైతే ఐదేండ్లలో రాష్ట్ర అప్పు 6.37 లక్షల కోట్లకు చేరుకుంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పు కేవలం రూ.4.17 లక్షల కోట్లే' అని హరీశ్‌రావు వివరించగా.. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అందులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను మాపై రుద్దిపోయింది. వాటిని క్లియర్ చేసుకుంటూ వస్తున్నాం. గత ప్రభుత్వం మాదిరిగా అప్పుల లెక్కలు దాచం. ప్రజల ప్రతిపైసాకూ జవాబుదారీగా ఉంటామన్నారు.

ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర అప్పుల వివరాలను సభలో ప్రకటించారు. 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని వెల్లడించారు. దీనికి అడ్డు తగిలిన హరీశ్ రావు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనలోనే రూ.1.27 వేల కోట్ల అప్పు చేసిందని ఫైర్ అయ్యారు. ఈ లెక్కన రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వం రూ.6.36 వేల కోట్ల అప్పు చేయబోతోందని అన్నారు. అప్పులపై ప్రభుత్వ పెద్దలు నోటికొచ్చినట్లుగా ఏది పడితే అది మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది పూర్తిగా అవాస్తవని ఈ విషయంలో తాను ఛాలెంజ్ చేస్తానని హరీశ్ రావు సవాల్ విసిరారు.ప్రస్తుతం రాష్ట్రానికి రూ.4.47 లక్షల కోట్ల అప్పు ఉంటే.. రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నట్టుగా చెబుతున్నారని మండిపడ్డారు. అందుకే తాము రాష్ట్ర అప్పులపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చామని స్పష్టం చేశారు. అయితే, తాము ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్లపై ఈ సమావేశాల్లోనే చర్చ పెట్టాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

అయితే, ఆ వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక కూడా బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో ఏ మాత్రం మార్పు రాలేదని.. సభలు వాస్తవాలు మాట్లాడాలని కౌంటర్ ఇచ్చారు. అప్పుల పూర్తి లెక్కలను తాము స్పష్టంగా వివరించి చెప్పామని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందని ఫైర్ అయ్యారు. పైగా చేసిన అప్పులను దాచేసి.. తిరిగి తమపైనే నిందలు వేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన అప్పులు దాచడమే కాకుండా.. తిరిగి తమపైకి మాటల దాడికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు భట్టి చేసిందంతా చేసి తమపైనే ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారని ధ్వజమెత్తారు. సభను బీఆర్ఎస్ పూర్తిగా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.అసెంబ్లీ లో చర్చ జరగాలనే తాము శ్వేతపత్రం విడుదల చేశామని అన్నారు. రాష్ట్ర అప్పులపై తాము చర్చకు సిద్ధంగా

మిగితా 2వ పేజీలో

## మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ శాసనసభ మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన మధ్య ఈ బిల్లులకు ఆమోదం తెలిపింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులకు ఆమోదం లభించింది. ఎలాంటి చర్చ లేకుండా బిల్లులను ఆమోదించారు.

బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. పరిశ్రమల కోసం భూసేకరణ, రైతుల అక్రమ అరెస్టులపై తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని చర్చకు చేపట్టాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది. ప్లకార్డులతో సభలో ఆందోళనకు దిగారు.ఇదే సమయంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయనందుకు తాము ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసు విషయమై బీజేపీలో పట్టుబట్టింది. ఇరు పార్టీల సభ్యులు సభలో నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసనల మధ్యే కాంగ్రెస్ సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ క్రీడా విశ్వవిద్యాలయం బిల్లుపై చర్చలో పాల్గొన్నారు. విపక్ష సభ్యుల ఆందోళనపై స్పందించిన శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని, పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని మండిపడ్డారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసును సభాపతి నిబంధనల మేరకు చేపడతారని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల ఆందోళన మధ్యే బిల్లులను ఆమోదానికి పెట్టారు. మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టిన క్రీడా విశ్వవిద్యాలయ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లును సీఎం తరపున మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టారు. జీఎస్టీ చట్ట సవరణ బిల్లును మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన మధ్య రెండు బిల్లులపై ఎలాంటి చర్చ లేకుండానే శాసనసభ ఆమోదం తెలిపింది. పర్యాటక విధానంపై స్వల్ప చర్చ అనంతరం సభను రేపటికి శాసనసభాపతి వాయిదా వేశారు.

# దమ్ముంటే 15 రోజులపాటు అసెంబ్లీని నిర్వహించాలి




- **స్కాములు, ఫార్ములా అవినీతి అంశాలపై కూడా చర్చిద్దాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డికి దమ్ముంటే కనీసం 15 రోజులపాటు అసెంబ్లీని నిర్వహించాలి.. రాష్ట్రంలో ఉన్న రైతన్నలు నేతన్నలు ఆటో డ్రైవర్లు గురుకుల పాఠశాలల నుంచి మొదలుకొని రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల సమస్యల పైన వారికి ప్రభుత్వం చేసిన కార్యక్రమాల పైన చర్చ పెట్టాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ లో కొడంగల్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు పార్టీ సీనియర్ నాయకులు (సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్,నవీన్ రెడ్డి, గోరేటి వెంకన్న, పొన్నాల లక్ష్మయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు) పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " రేవంత్ రెడ్డికి దమ్ముంటే కనీసం 15 రోజులపాటు ప్రజా సమస్యల పైన చర్చించాలన్నారు. రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్న స్కాములపైన... ఫార్ములా– ఈ వంటి అంశాల పైన చర్చించినా మేము సిద్ధమే క్యాబినెట్ మీటింగ్ అంటూ... గంటల తరబడి ఎవరిని అరెస్టు చేయాలో చర్చించడం కాదు పాలన అంటే ప్రజలకు

మిగితా 2వ పేజీలో

## ఆ ఇళ్లను కూల్చం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ ఏడాది జులై 19 తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా, కూకట్‌పల్లి మండలం, ఖైతలాపూర్ పరిధిలోని కాముని చేరువుతో పాటు మైసమ్మ చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. చెరువులో నిర్మాణాలు చేపడితే కూల్చి వేస్తామని హెచ్చరించారు. హైడ్రా 2024 జూలైలో ఆవిర్భవించిందని అప్పటికే నివాసం ఉంటే ఆ నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని కమిషనర్ చెప్పారు. అయితే ఈ నిబంధన వాణిజ్య సముదాయాలకు వర్తించదని స్పష్టం చేశారు. అలాగే సంబంధిత ప్రభుత్వ విభాగాల అనుమతులున్న నిర్మాణాల జోలికి కూడా హైడ్రా వెళ్లదన్నారు. హైడ్రా ఆవిర్భవించిన తర్వాత జరిగిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, దాంతోపాటే ఎలాంటి పర్మిషన్స్ లేకుండా కడుతున్న వాటిని సైతం కూల్చేస్తామన్నారు. నూతనంగా తీసుకున్న అనుమతులను సైతం పరిశీలిస్తామన్నారు. సర్కారు విధానాలకు

మిగితా 2వ పేజీలో

## డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలుంటే.. రూ. 4100 కోట్లు కావాలని ఎలా అడిగారు

- **సభను తప్పదోవ పట్టిస్తే అవసరమైతే ప్రివిలేజ్ మోషన్ ను ప్రవేశపెడతాం**
- **ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



మూసీ అభివృద్ధి పేరిట ఆ పరివాహక ప్రాంతంలో కూలగొట్టిన ఇళ్లకు ఈఎంఐలు ఉంటే ప్రభుత్వం చెల్లిస్తుందా..? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సూటిగా ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా డీపీఆర్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రస్తావించగా.. ఎమ్మెల్సీ కవిత పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు. మూసీ నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ రూ. 4100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వ ఆశ్రయించినట్లు మాకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించిన విషయం వాస్తవమా కాదా..? డీపీఆర్ తయారు కాలేదని ప్రభుత్వం ఈ రోజు సభకు చెప్పింది. ఏ తేదీన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సాయం కోరుతూ ప్రతిపాదనలు పంపించింది. మూసీ కోసం రూ. 14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతో పాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఏ ప్రాతిపదికన అడిగారు. ఒక వేళ కేంద్రాన్ని సాయం కోరడం, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, ప్రజలను ఎందుకు తప్పుదోవపట్టిస్తున్నారు..? సభను తప్పదోవ పట్టిస్తే అవసరమైతే ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెడుతాం అని కవిత హెచ్చరించారు. మూసీ నదిగర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోంది. కానీ హృదయవిదారకమైన వీడియోలను చూస్తే ప్రభుత్వం చెబుతున్నది అవసస్తవమని స్పష్టమవుతోంది. ఆ 309 కుటుంబాలు సమ్మతిస్తూ ఏవైనా పత్రాలపై సంతకాలు చేసి ఉంటే అవి సభకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఇది వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. మూసీ నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత సూచించారు. కూలగొట్టిన ఇళ్లకు ఉంటే ఈఎంఐలను ప్రభుత్వం చెల్లిస్తుందా అని ప్రశ్నించారు.

# సంధ్య థియేటర్‌కు షోకాజ్ నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

సంధ్య థియేటర్ కు మంగళవారం హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డిసెంబర్ 4 రాత్రి పుష్ప–2 సినిమా ప్రీమియర్ షో సమయంలో థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మరణించారు. ఆమె కొడుకు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై థియేటర్ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని నోటీసలు జారీ చేశారు. దీనిపై 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో కోరారు. ఇదే కేసులో హీరో అల్లు అర్జున్ ను డిసెంబర్ 13న అరెస్ట్ చేశారు. కిమ్స్ లో శ్రీతేజ్ ను పరామర్శించిన హైదరాబాద్ సీపీ డిసెంబర్ 4న తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పరామర్శించారు. వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నారు.ఆక్సిజన్ అందని కారణంగా బాలుడి బ్రెయిన్ డ్యామేజ్ అయిందని సీపీ తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల చేస్తారని ఆయన అన్నారు.



# పెండింగ్ ఫీజులను దశల వారీగా చెల్లిస్తాం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంజినీరింగ్, సాంకేతిక కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రయివేట్ కళాశాలల యజమానులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు, అసలు కలిపి ఏడాదికి 66 వేల కోట్లు, రైతు రుణమాఫీ కోసం రూ. 21 వేల కోట్లు మొత్తం ఈ ఏడాది రెండు అంశాలకే రూ. 87 వేల కోట్ల నగదును చెల్లించామని వారికి వివరించారు. ఆర్థిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారించుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో అప్పుల కుప్పపై చర్చ

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నామని తెలిపారు. అప్పులపై సభలో చర్చకు భట్టి చేసిన సవాలును తాము స్వీకరిస్తున్నామని.. చర్చకు సిద్ధమని హరీశ్ రావు ప్రకటించారు.

తనకు హరీశ్ రావు మీదర చాలా గౌరవం ఉందని.. కానీ, అలాంటి వ్యక్తి సభ అన్న.. సభాపతి అన్న గౌరవం లేకుండా మాట్లాడుత ^న్నారని ఫైర్ అయ్యారు భట్టి. బీఏసీలో సమావేశం నుంచి వాకౌట్ చేయాల్సిన అవసరం ఏముందని హరీశ్ రావును ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారం పోయాక బీఆర్ఎస్ పార్టీకి మతిపోయిందిన భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. గడిచిన పదేళ్లలో బీఏసీ సమావేశం ఎలా నిర్వహించారో మర్చిపోయారా అంటూ చురకలంటించారు. గతంతో పాటించిన నిబంధనలే తాము ఇప్పుడు పాటించాలి కదా అని సెటైర్లు వేశారు. సభలో కూడా ఎవరైనా రూల్ బుక్ ప్రకారమే నడుచుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనికి హరీశ్ రావు సమాధానం ఇస్తూ బిఏసి లో చర్చించకుండా ఏ బిల్లు కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టక ^హడదంటూ రూల్ ను చదివి వినిపించారు.. ఇదే విషయాన్ని బిఏసిలో తాను ప్రస్తావిస్తే తనను ఓవర్ లుక్ చేశారన్నారు.. గతంలో ఎన్నడూ బిఏసి నిర్ణయాలకు వ్యతిరేకంగా సభలో ప్రవర్తించలేదన్నారు హరీశ్ రావు .



## ఆ ఇళ్లను కూల్చం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**(మొదటి పేజీ తరువాయి)**

అనుగుణంగా చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా పనిచేస్తోందన్నారు. పేదల జోలికి హైడ్రా వెళ్లదని, వాళ్ల ఇళ్లను కూల్చేస్తామనే ప్రచారాలను నమ్మొద్దని రంగనాథ్ స్పష్టం చేశారు. ఇక హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో, హెచ్ఎండిఏ అధికారులు, హైడ్రా అధికారులు కాముని చెరువుని పరిశీలించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూకట్‌పల్లిలోని కావలి చెరువు ప్రాంతాలను పరిశీలించారు. కూకట్‌పల్లి రాఘవేంద్ర కాలనీ, కాముని చెరువు స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన పరిశీలించారు. కాముని చెరువు కింద భాగంలో ఉన్న మైసమ్మ చెరువు వాసవి నిర్మాణ సంస్థ నిర్మాణాలను, నాలా మళ్లింపు స్థలాలను ఆయన పరిశీలించారు. నాలా మళ్లింపు చేసి రిటైనింగ్ నిర్మించకపోవడంతో ఆయన నిర్మాణ సంస్థ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల లోపల రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి పనులు ప్రారంభించాలని, ఒకవేళ అలా నిర్మాణ పనులు చేపట్టకపోతే చర్యలు తప్పని హెచ్చరించారు. చెరువుల సుందరీకరణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువు ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు పాల్పడిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు హైడ్రా పని చేస్తోందన్నారు.

## ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నారాయణ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు, విద్యార్థి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయిపల్లి గ్రామానికి చెందిన పండుగ మధుసూదన్‌రెడ్డి కుమారుడు లోహితస్య రెడ్డి(12) హయత్‌నగర్ నేతాజీనగర్‌లో ఉన్న నారాయణ స్కూల్‌లో 7వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. అయితే, అతను అనారోగ్యంతో బాధపడుతూ హాస్టల్‌లో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. రెండు నెలల నుంచి తండ్రికి ఫోన్‌లో సమాచారం ఇస్తున్నాడు. 7వ తరగతి పూర్తయ్యేదాక కొన్ని నెలలు ఆగాలని తండ్రి సూచించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి లోహితస్యరెడ్డి తన గదిలోకి వెళ్లి టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తోటి విద్యార్థులు, సిబ్బంది గమనించి అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. స్కూల్ యాజమాన్యం తండ్రికి ఫోన్ చేసి సమాచారమివ్వడంతో వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. బాలుని తండ్రి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మెడిసిన్ చేసిన వాళ్లు స్థానికులే

- హైకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ(ఎంబీబీఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదం మెడిసిన్ అండ్ సర్జరీ(బీఏఎంఎస్), బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్) కోర్సులు పూర్తి చేసిన వాళ్లు స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో 'స్థానికులు'గా పరిగణించాలంది. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే అడ్మిషన్‌లు కల్పించాలని తేల్చి చెప్పింది. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని పేర్కొంది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు సవరణ తీసుకువచ్చే అధికారం ఉందనీ, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణ స్థానికతతో ఇతర ప్రాంతాల్లో ఇదే కోర్సులు పూర్తి చేసిన వారిని కూడా 'లోకల్' కిందే కౌన్సిలింగ్ నిర్వహించాలంది. అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాక నిబంధనలను మార్పు చేయడాన్ని తప్పుపట్టింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 148, 149లను కొట్టేస్తూ తీర్పు వెలువరించింది. ఈ జీవోలు చట్ట వ్యతిరేకమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95, రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత వంటి వాటిని ధర్మాసనం తన తీర్పులో ఉదహరించింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అడ్మిషన్ల) నిబంధనలు 2021లోని రూల్ 8(2)ను, తెలంగాణ అడ్మిషన్ పోస్టుగ్రాడ్యుయేట్(ఆయుష్) కోర్సుల నిబంధనలు 2024లోని రూల్ 8 (2)ను ప్రభుత్వం సవరించింది. గత అక్టోబర్‌లో 28న 148, 149 జీవోలను జారీ చేసింది. ఈ జీవోలు చట్టవిరుద్ధమని తీర్పులో పేర్కొంది.

ఇదే హైకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా జీవోలు ఉన్నాయని తేల్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15 శాతం) పోను మిగిలిన కన్వీనర్ కోటా సీట్లు (85 శాతం) స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 72ను సమర్థిస్తూ గత సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులు 1974ను ఉల్లంఘించలేదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కి కూడా జీవో 72 విరుద్ధం కాదంది. పీజీ మెడికల్ అడ్మిషన్ల రూల్స్‌ను మార్పు చేయడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రజిత, మంచిర్యాలకు చెందిన సత్యనారాయణ, స్థానికత వ్యవహారంపై సుమారు వంద మంది వేర్వేరుగా వేసిన పిటిషన్లపై హైకోర్టు ఈ కీలక తీర్పును వెలువరించింది.

## దమ్ముంటే 15 రోజులపాటు అసెంబ్లీని నిర్వహించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

మంచి చేసేందుకు చర్చించడమే పాలన అనే విషయం గుర్తుంచుకోవాలి. కొడంగల్ ప్రజల కోసం నిలబడిన మా మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ఉక్కుమనిషిగా మారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భవిష్యత్తులో తుక్కుతుక్కు చేస్తాడు

భవిష్యత్తులో లగచర్ల నుంచే మన జైత్రయాత్ర ప్రారంభమవుతుంది ... రేవంత్ రెడ్డి పతనం మెదలైతుంది గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి నక్క వినయాలు ప్రదర్శించి, అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు రుణమాఫీ నుంచి మొదలుకొని అన్ని హామీలను తుంగలో తొక్కింది రైతు రుణమాఫీ ఎక్కడ 100% పూర్తి కాలేదు. రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డి పల్లె కానీ లేదా తెలంగాణలోని ఏ గ్రామంలోనైనా ఈ సవాల్కి సిద్ధమని చెబితే ముఖ్య మంత్రి పారిపోయిండు తెలంగాణలో 30% కూడా రైతు రుణమాఫీ కాలేదు కానీ రాహుల్ గాంధీ నుంచి మొదలుకొని కాంగ్రెస్ కార్యకర్త దాకా సిగ్గు లేకుండా అబద్దాలు ఆడుతున్నారు రుణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే రైతులు కచ్చితంగా కాంగ్రెస్ కి బుద్ధి చెబుతారు ఒక్క ఏడాది కాలంలోనే ఈ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమై హామీలను అమలు చేయలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది మా పార్టీ అధినేత కేసిఆర్ రావాలి అని డిమాండ్ చేస్తున్న రేవంత్ రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన మా కార్యకర్తలనే తట్టుకోలేకపోతున్నాడు... ఈయన స్థాయికి కెసిఆర్ అవసరంలేదు

మా నాయకుడు పట్నం నరేందర్ రెడ్డి తో పాటు లగచర్ల రైతుల బెయిల్ కోసం అన్ని రకాలుగా మా పార్టీ ముందు నుంచి కొట్లాడుతుంది ఇప్పటికే వారి బెయిల్ కి సంబంధించిన వాదనలు పూర్తి అయ్యాయి రేపు కోర్టులో మాకు న్యాయం లభిస్తుందన్న నమ్మకం ఉన్నది పట్నం నరేందర్ రెడ్డి వెంట నిలబడిన న్యాయవాదులు అందరికీ పార్టీ కార్యకర్తలు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తన బెయిల్ గురించి కాకుండా రైతుల బెయిల్ గురించి ఆందోళన చెందుతున్న గొప్ప నాయకుడు మా మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి. లగచర్ల భూములు గుంజుకోవాలన్న దుర్మార్గంతోనే రేవంత్ రెడ్డి కుటుంబం వ్యవహరిస్తుంది అందుకే ఫార్మా విలేజ్ క్యాన్సిల్ చేసుకున్నామని చెప్పి... ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో కొత్త నాటకంతో ముందుకు పోతుంది తిరుపతి రెడ్డి అనేటోడు కనీసం వార్డ్ మెంబర్ కాదు జెడ్పిటిసి కాదు కానీ పోలీసులు అండతో అరాచకం చేస్తున్నాడు కొడంగల్ లో సేకరిస్తున్న రైతన్న భూములు పరిశ్రమల కోసం కానే కాదు కేవలం అల్లుడి కోసం ఆదానీ కోసం పరిశ్రమలు పెట్టడం, ఉపాధి కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రాధాన్యత అయితే వెల్దండలో ఉన్న 500 ఎకరాల భూమిలో పరిశ్రమలు పెట్టి ఉపాధి ఇవ్వాలి.

లగచర్ల అంశాన్ని వదిలిపెట్టము... అసెంబ్లీ నడిచినని రోజులు లేవనెత్తుతూనే ఉంటాము... ఈరోజు అరెస్టు చేసిన లగచర్ల రైతులను, పార్టీ నేతలను వెంటనే పోలీసులు విడుదల చేయాలి కొడంగల్ పార్టీ శ్రేణులను కాపాడుకునే బాధ్యత మాది .... రేవంత్ రెడ్డి అరాచకాలకు ఎవరు భయపడాల్సిన అవసరం లేదు" అని అన్నారు.

**రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేస్తున్న చీరలను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. మంత్రి సీతక్క ఎంపిక చేసిన చీరలను అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రికి చూపించారు. రాష్ట్రంలోని 60 లక్షల మందికి పైగా స్వశక్తి కలిగిన మహిళలకు ప్రభుత్వం త్వరలోనే ఈ చీరలు పంపిణీ చేస్తుందని ప్రకటించారు.**



**బతుకమ్మ చీరలకు బదులు స్వశక్తి సంఘాల మహిళలకు చీరలు అందజేస్తామన్నారు.**

# భారత్‌కు తప్పిన ఫాలో-ఆన్

- రాణించిన రాహుల్, జడేజా
- ఆకట్టుకున్న టెయిలెండర్లు ఆకాశ్ దీప్, బూమ్రా
- 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోర్ 252/9




**బలగం టీవీ, బ్రిస్బేన్**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానం వేదికగా జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్‌లో భారత్‌కు ఫాలో ఆన్ గండం తప్పింది. ఓవర్ నైట్ స్కోరు 51/4తో బ్యాటింగ్ ఆరంభించిన భారత్... ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. వర్షం పలుమార్లు అంతరాయం కలిగించిన నాలుగవ రోజున భారత్ 201 పరుగులు మాత్రమే జోడించింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా ఇంకో 193 పరుగులు వెనుకబడి ఉంది. కేఎల్ రాహుల్ 84, రవీంద్ర జడేజా 77 పరుగులతో రాణించడంతో భారత్ ఫాలో-ఆన్ గండాన్ని తప్పించుకుంది. ఆట ముగిసే సమయానికి జస్ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్ క్రీజులో ఉన్నారు. చివరి వికెట్‌కు వీరిద్దరూ 39 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆకాశ్ దీప్ 27, బుమ్రా 10 పరుగులతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఆకాశ్ దీప్ 31 బంతులు ఎదుర్కొని 2 ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా కూడా ఒక భారీ సిక్సర్ బాదడం విశేషం.



ఇక భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ 4, కేఎల్ రాహుల్ 84, శుభ్‌మాన్ గిల్ 1, విరాట్ కోహ్లీ 3, రిషబ్ పంత్ 9, రోహిత్ శర్మ 10, రవీంద్ర జడేజా 77, నితీశ్ కుమార్ రెడ్డి 16, మహ్మద్ సిరాజ్ 1, జస్ప్రీత్ బుమ్రా 10 (బ్యాటింగ్) ఆకాశ్ దీప్ 27(బ్యాటింగ్) పరుగులు సాధించారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమ్మిన్స్ 4, మిచెల్ స్టార్క్ 3, జాస్ హేజెల్‌వుడ్, నాథన్ లియోన్ చెరో వికెట్ తీశారు.

## హేజిల్‌వుడ్‌కు గాయం..

**బలగం టీవీ, బ్రిస్బేన్**




ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ మళ్లీ గాయపడ్డాడు. దీంతో అతను భారత్‌తో జరిగే మిగితా రెండు టెస్టులకు దూరంకానున్నాడు. కుడి కాలుకు చెందిన పిక్క కండరాల్లో అతనికి నొప్పి వస్తోంది. దీని వల్ల ప్రస్తుత టెస్టుతో పాటు రాబోయే రెండు టెస్టులకు కూడా హేజిల్‌వుడ్ దూరం కానున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తన ప్రెస్ రిలీజ్‌లో పేర్కొన్నది. వార్మప్ సమయంలో హేజిల్‌వుడ్ కండరాలకు గాయమైంది. నాలుగవ రోజు కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేశాడు. అడిలైడ్‌లో గాయం వల్ల ఆడలేకపోయిన హేజిల్‌వుడ్.. బ్రిస్బేన్‌లో ఆడినా మళ్లీ అతనికి గాయమైంది. పిక్క కండరాలకు గాయం వల్ల అతను సిరీస్‌కు దూరం అయ్యే ప్రమాదం ఉన్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. త్వరలో అతని స్థానంలో కొత్త బౌలర్‌ను ప్రకటించనున్నట్లు సీఏ పేర్కొన్నది. అడిలైడ్ టెస్టులో హేజిల్‌వుడ్ స్థానంలో ఆడిన స్కాట్ బోలాండ్.. మళ్లీ ఆసీస్ జట్టులో చేరే ఛాన్సున్నది. బాక్సింగ్ డే టెస్టుకు అతను అందుబాటులో ఉండనున్నాడు.

## టాప్-3లోకి స్మృతి మంధాన

**ఐసీసీ టీ20, వన్డే ర్యాంకింగ్స్ విడుదల**


**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్-3లోకి దూసుకొచ్చింది. వన్డే ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి చేరిన మంధాన, టీ20 ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్ దక్కించుకుంది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ సిరీసుల్లో ప్రదర్శనల ఆధారంగా మంధాన ర్యాంక్‌లు మెరుగుపడ్డాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో మంధాన సూపర్ సెంచరీ (105) చేసింది. తాజాగా స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో మెరుపు అర్ధ సెంచరీ (54) సాధించింది. ఇదిలా ఉండగా టీమ్ ఇండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వన్డేల్లో రెండు స్థానాలు దిగజారి 13వ ప్లేస్‌కు పడిపోయింది. టీ20 ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగై పదో ప్లేస్‌లో నిలిచింది. దీప్తి శర్మ ఐదు స్థానాలు దిగజారి 32వ ప్లేస్‌కు పడిపోయింది.

## మోహన్ లాల్ బరోజ్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**





మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటించి స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం బరోజ్. మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ డిగామా బంగ్లాలోపల ఎవరికీ కనిపించని భూతం ఉందంటూ ఓ చిన్నారి వాయిస్ ఓవర్‌తో మొదలైంది ట్రైలర్. వందల సంవత్సరాలుగా నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం. మిగితా వారి కోసం కార్చే కన్నీరు కంటే మహత్తరమైన నిధి ఈ లోకంలో మరేది లేదంటున్నాడు బరోజ్. నిధుల తోటకు కాపాలా ఉండే బరోజ్ కథ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఈ మూవీని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరంబవూరు తెరకెక్కిస్తున్నారు.




## 'డెకాయిట్'లో మారిన హీరోయిన్..!

- అడివి శేష్ బర్త్‌డే సందర్భంగా పోస్టర్స్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ యాక్టర్ అడివి శేష్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం డెకాయిట్ నుంచి మేకర్స్ రెండు కొత్త పోస్టర్స్ విడుదల చేశారు. ఇక ఈ సినిమా టైటిల్ కు ఒక ప్రేమ కథ అనే ట్యాగ్ లైన్ కూడా ఇచ్చారు. అయితే, ఇంతకుముందు ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ను ప్రకటించగా.. ఇప్పుడు ఆమె స్థానంలో మృణాల్ ఠాకూర్ ను తీసుకున్నారు.

ఇక రెండు పోస్టర్లు విడుదల కాగా అందులో ఒక పోస్టర్‌ను మృణాల్ 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "అవును వదిలేసాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను" అని రాసుకొచ్చారు. దీనికి రిప్లైగా అడివి శేష్ మరో పోస్టర్ షేర్ చేశారు. దీనికి ఆయన.. "అవును ప్రేమించావు.. కానీ మోసం చేసావు.. ఇడిచిపెట్టను.. తేల్చాల్సిందే" అని రాసుకొచ్చారు. ఇప్పుడీ రెండు పోస్టర్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. కాగా, ఈ సినిమాను షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు.




## 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎన్టీఆర్, రామ్ చరణ్ హీరోలుగా దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. తాజాగా ఆ సినిమా తెర వెనుక విశేషాలు చెప్పేందుకు మూవీ టీమ్ రెడీ అయింది. 'ఆర్ఆర్ఆర్ : బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో డాక్యుమెంటరీ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఎంపిక చేసిన పలు థియేటర్లలో ఈ డాక్యుమెంటరీ ఈ నెల 20న విడుదల చేయనున్నారు.

## "విడుదల 2 రన్ టైం 2 గంటల 52 నిమిషాలు..

**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ సేతుపతి హీరోగా నటించిన తాజా చిత్రం "విడుదల పార్ట్ 2". ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ తెరకెక్కించిన ఈ హై వోల్టేజ్ ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామా చాలా కాలం నుంచి తెరకెక్కిస్తూ ఇపుడు ఎట్టకేలకి రిలీజ్ కి రాబోతుంది. అయితే తమిళ్ లో సహా తెలుగులో ఈ డిసెంబర్ 20న వస్తున్న ఈ సినిమా ఏకంగా 2 గంటల 52 నిమిషాల పెద్ద నిడివితోనే వస్తుంది.ఇంత పెద్ద రన్ టైంతో వస్తున్న ఈ చిత్రం ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి మరి.